క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలో రావాలని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, రాజేష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ద్వితీయ శ్రేణి నాయకుల్లో టెన్షన్

సుభాష్‌నగర్: శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడుతుండటంతో స్థానికంగా ద్వితీయ శ్రేణి నాయకుల్లో టెన్షన్ మొదలైంది. ఫలితాలు స్థానికంగా ఉన్న బూత్ నుండి నాయకత్వం వహిస్తున్న ఆయా పార్టీ నాయకులు తమ సెంటర్ నుండి ఫలితాలు ఏ విధంగా వస్తాయోనని బేరీజు వేసుకుంటున్నారు. ఆ నాయకునికి సంబంధించిన బూత్ నుండి ఓట్లు ఎక్కువ సంఖ్యలో పడితే ఓకే. కానీ ఇతర పార్టీల కంటే తక్కువ ఓట్లు పడితే తమ పరిస్థితి ఏమిటని మరోవైపు ఆందోళనకు గురవుతున్నారు.

ఘనంగా ఉర్సు

మేడ్చల్: పట్టణంలోని హజ్రత్ జిందా షా మదార్ రహమతుల్లా అలై దర్గాలో ఉర్సు ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సందల్(గంధం) దర్గా షరీఫ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. చాదర్ సమర్పణ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు లాయక్‌అలీ, మహమ్మద్ అబ్దుల్ బారీ తదితరులు పాల్గొన్నారు.

విజయయాత్రలో నైపుణ్యానిది ప్రముఖ పాత్ర

ప్రొఫెసర్ సత్యనారాయణ

ఘట్‌కేసర్: ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులు నూతన కోర్సులు, ఆధునిక సాంకేతికతపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసమే కాకుండా బంగారు భవిష్యత్ కోసం, ఆచరణాత్మక నైపుణ్యం పెంపొందించుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణుడు దర్పణ్ వాసుదేవ్, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, సంస్కృతి విద్యాసంస్థల కార్యదర్శి మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

కీసర: భోగారం హోలీమేరి కళాశాల్లో ఆదివారం ఉదయం ఐదు అసెంబ్లీ(మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి)ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. కీసర మీదుగా వయా భోగారం మీదుగా ఘట్‌కేసర్ వెళ్లే వాహనాలను భోగారం వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా ఘట్‌కేసర్ చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, అదేవిధంగా ఘట్‌కేసర్ నుంచి భోగారం వయా కీసరకు చేరుకునే వాహనాలను ఘట్‌కేసర్ వయా ఓఆర్ఆర్ సర్వీస్ రహదారి మీదుగా కీసరకు చేరుకునే విధంగా వాహనాల మళ్లింపు ఉంటుందని, ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని, ఆదివారం ఉదయం 6 గంటల నుండే ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు.

ఎన్నికల విజయోత్సవాలపై నిషేధం

సీఐ మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆదివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, రాజకీయ వేడుకలు నిర్వహించరాదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాల అనంతరం బాణాసంచా కాల్చరాదని, సాంస్కృతిక కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు, డీజే, బ్యాండ్ సౌండ్ చేయరాదన్నారు. గుంపులుగా తిరగడం, ఓడిన పార్టీ అభ్యర్థుల కార్యకర్తలను అపహాస్యం చేయడం, ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడటం, అవహేళన చేయరాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతకర పోస్టులు పెట్టరాదని, గెలిచిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు విజ్ఞత పాటించాలని కోరారు.

ఫలితాలపై అందరి చూపు

• నేడే ఎన్నికల కౌంటింగ్ • సాయంత్రానికి ఫలితం వచ్చే అవకాశం

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుందని, సాయంత్రం వరకు ఫలితం వస్తుందని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. అధికారులు మొత్తం 28 టేబుళ్లను ఏర్పాటు చేసి 590 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కౌంటింగ్ 22 రౌండ్ల వారీగా లెక్కిస్తారని, ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత మరో రెండు ఇస్తామని పేర్కొన్నారు. మొత్తం 6,99,130 మంది ఓటర్లు ఉండగా 3,99,852 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 57.18 శాతం పోలింగ్ నమోదైంది.

అభ్యర్థుల్లో అందరిలో టెన్షన్.. టెన్షన్..!

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఎన్నికల ఫలితాలపై పోటీ చేస్తున్న 15 మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వివేకానంద్(బీఆర్ఎస్) కూన శ్రీశైలం గౌడ్ (బీజేపీ) హనుమంత్ రెడ్డి (కాంగ్రెస్) కూడికలు తీసివేతల్లో మునిగితే ఎలాగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన 12 మంది అభ్యర్థులు ప్రచారంలో పెద్దగా ప్రభావం చూపకపోగా వీరిలో స్వతంత్ర అభ్యర్థిగా విద్యార్థి సంఘం నేత సాయికుమార్ పంతుల తనదైన శైలిలో ప్రచారం చేసి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలో సాయికుమార్ కు ఓట్లు పడతాయని నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఓట్లు వేస్తారన్న నమ్మకం ఉందని ఆయన 'సాక్షి'తో అన్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల పరిస్థితి ఇప్పుడు ఆందోళనకరంగా ఉంది. 57.18 శాతం ఓట్లు వేయగా వాటిలో తమకు ఎంత శాతం ఓట్లు వస్తే గెలుస్తాము.. అన్న లెక్కలు వేస్తూ కూడికలు తీసివేతలు చేస్తున్నారు. 2014లో ప్రస్తుతం పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థులు ముగ్గురు ఒకరికొకరు ఎన్నికల్లో పోటీపడ్డవారే. నాడు టీడీపీ నుండి వివేకానంద గెలుపొందగా తాజాగా పోటీపడుతున్న ఈ ముగ్గురిలో 2023 విజేత ఎవరు అన్న ఉత్కంఠత రేపుతుంది.



ఎన్నికల విధుల్లో రిటర్నింగ్ అధికారి పులి సైదులు..

మరికొద్ది గంటలే...

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

దుండిగల్: మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 590 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 6,99,130 మంది ఓటర్లు ఉండగా 3,99,852 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల కౌంటింగ్‌ను బోగారంలోని హోలిమేరి కళాశాలలో నిర్వహించనున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కౌంటింగ్ సైతం అక్కడే జరగనుంది.

కౌంటింగ్ ఇలా..

- మొత్తం 28 టేబుళ్లల్లో ఒక్కో రౌండ్లలో 28 ఈవిఎంలను లెక్కిస్తారు.
- నియోజకవర్గంలో 590 బూత్‌లు ఉండగా 28 టేబుళ్లల్లో 21 రౌండ్లల్లో ప్రతి రౌండ్‌లో 28 ఈవిఎంలను లెక్కించగా 588 ఈవిఎంలు పూర్తవుతాయి. చివరి 22 రౌండ్‌లో మిగిలిన రెండు ఈవిఎంలను లెక్కిస్తారు.
- పోలైన ఓట్లు, ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్లు సమానంగా ఉన్నాయా.. లేదా అని అధికారులు సరి చూసుకుంటారు.
- వాటిని నోట్ చేసుకోవడంతో పాటు ఏజెంట్లకు కూడా చూపించి వారి సంతకాలు తీసుకుంటారు.
- వాటిని ఏజెంట్లు నోట్ చేసుకున్న అనంతరం ఈవీఎంల సీల్‌ను తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు.
- వెంటనే అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లు వెలువడుతాయి.
- ఒక్కొక్క రౌండ్‌లో 28 ఈవీఎంల ఫలితాలు వెల్లడవుతాయి.
- 590 కేంద్రాలకు గాను 22 రౌండ్లలో ఫలితాలు తెలుస్తాయి.
- ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు.
- లెక్కింపు ప్రక్రియ అంతా రాజకీయ పార్టీలు, ఏజెంట్ల సమక్షంలో సాగుతుంది. ప్రతి రౌండ్ ఫలితం వారి ఆమోదం మేరకే వెల్లడిస్తారు.

సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నాం



హమీద్ బస్తీలో పర్యటిస్తున్న జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: ప్రజలకు జలమండలి ఆధర్యంలో సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో మేనేజర్ రాజుతో కలిసి ఆయన పర్యటించారు. బస్తీలలో నెలకొన్న తాగునీటి సరఫరాలో సమస్యలు, అదే విధంగా మురుగునీటి సమస్యలపై వినియోగదారులను జీఎం శ్రీధర్ రెడ్డి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది తమ ఇళ్లకు ఉన్న నీటి కనెక్షన్లకు నల్లాలు లేకపోవడంతో శ్రీధర్ రెడ్డి సదరు వినియోగదారులను పిలిచి నల్లాలకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొంతమంది వినియోగదారులు నీటిని పట్టుకుని అనంతరం పైపులను నాలాల్లోకి వదులుతుండటంతో గమనించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లాలు ఏర్పాటు చేసుకొని వినియోగదారులపై దృష్టి సారించి ప్రతి వినియోగదారుడు నల్లా ఏర్పాటు చేసుకునే విధంగా మేనేజర్, సిబ్బంది చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా మురుగునీటి వ్యవస్థ తీరుపై జెట్టింగ్ మిషన్లను ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హమీద్ బస్తీ, ముత్యాల బస్తి తదితర ప్రాంతాలతో పాటు పలు బస్తీలలో పర్యటించారు.

జోరుగా బెట్టింగ్!

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరుగా జరిగాయి. ఏకంగా రూ. లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బెట్టింగులకు వివిధ పార్టీల నాయకులు దిగుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకాంద్ విజయం సాధిస్తాడని ఆ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డి గెలుపొందుతాడని మరికొందరు.. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ గెలిచితీరుతాడని సదరు పార్టీ నాయకులు బెట్టింగులు కడుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది నాయకులు ఏకంగా పోస్ట్‌డేటెడ్ చెక్కులు సైతం మార్చుకున్నట్లు తెలిసింది. గెలుపుతో పాటు మెజారిటీపై కూడా బెట్టింగులు కడుతున్నారు. ఏది ఏమైనా నేడు అభ్యర్థుల భవిత్యవం తేలనుంది. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎన్నికల ఫలితాలు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు కీసర మండలం బోగారం గ్రామంలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం డీఈవో గౌతమ్ పాత్రు, కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు ఇతర అధికారులు కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాలలో సదుపాయాలు, బెంచీలు సరిగా ఉన్నాయా, లైటింగ్, సెక్యూరిటీ తదితర అంశాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కళాశాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మూడంచెల రక్షణ ఏర్పాట్లు చేసినట్లు పులి సైదులు సాక్షికి తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్‌లు ఉన్న వారికే అనుమతి ఉంటుందని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు దగ్గరుండి పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు



నమూనాలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ లలితా కుమారి

జీడిమెట్ల: ప్రాజెక్ట్ నమూనాల ద్వారా చేసే విద్యాబోధన విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుందని రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ లలితా కుమారి నెల్సన్ అన్నారు. శనివారం అపురూపాకాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్‌లో ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లలితా కుమారి ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 4వ తరగతి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పాఠశాలలో ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూము భాస్కర్‌రావు పటేల్‌కు నివాళి

కూకట్‌పల్లి: మూసాపేట్‌కు చెందిన తూము భాస్కర్ రావు పటేల్ 60వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి డా. సత్యం శ్రీరంగంలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మూసాపేట మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల విద్యార్థులు, యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారుల సౌత్ జోన్ వాలీ బాల్ క్రీడాకారులు ఎంపిక జేఎన్‌టీయూహెచ్ క్రీడా ప్రాంగణంలో శనివారం వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డా. ఎస్. దిలీప్, జేఎన్‌టీయు కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్ రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడాకారులుగా మంచి ప్రావీణ్యం సంపాదించి మంచి క్రీడాకారులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు సహాయ సహకారాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు.

రామలింగేశ్వర స్వామి సేవలో..



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో శనివారం మేడ్చల్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారిణి పూర్వా గార్గ్ పాల్గొన్నారు. సాయంత్రం కీసరగుట్టకు చేరుకున్న ఆమెకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి(శివలింగం) ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు ఆమెకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్ ఆలయ విశిష్టతను తెలియజేశారు.

మహాభాగ్యం.. బ్రహ్మసూత్ర లింగ దర్శనం

• అత్వెల్లిలో దక్షిణకాశీగా అభివృద్ధి • ఆలయానికి పెరుగుతున్న భక్తులు



అత్వెల్లి బ్రహ్మసూత్ర శివాలయం



గర్భగుడిలో బ్రహ్మసూత్ర లింగం

మేడ్చల్: దేశవ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లో బ్రహ్మసూత్రం ఉన్న శివాలయాలది ప్రత్యేక స్థానం. సాధారణంగా శివాలయాల్లో శివలింగం స్పటిక, మరకత తదితర రూపాల్లో నునుపుగా ఉంటుంది. బ్రహ్మసూత్ర లింగాల్లో మాత్రం లింగం ముందర భాగంలో గీతలతో చెక్కబడి ఉంటుంది. ఇలాంటి లింగాలను దర్శిస్తే కోటి లింగాలను దర్శించినంత పుణ్యఫలం వస్తుందని పురాణాలు, వేద పండితులు చెబుతున్న మాట. బ్రహ్మసూత్ర లింగాలు ఉన్న ఆలయాలు అరుదుగా ఉంటాయి. అలాంటి బ్రహ్మసూత్ర లింగం ఉన్న ఆలయం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి ఉంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి గ్రామంలోని వేంకటేశ్వర ఆలయం పక్కన గుడిబండపై లింగం ఉండేది. ఆ లింగం చుట్టూ గీతలు ఉన్నాయి. అరుదుగా శివలింగాలపై ఉండే గీతలు బ్రహ్మసూత్ర లింగమని, దాని విశిష్టత తెలియని వారు ఆ శివుడి ఆలనా పాలనా పట్టించుకునే వారు లేకపోవడంతో చరిత్ర కనుమరుగైంది.

నీడ లేని సమయం నుంచి..

గ్రామానికి చెందిన కొందరు శివలింగంపై, నందీశ్వరుడిపై రేకులతో షెడ్లు వేసి నీడ కల్పించగా పూజలు మొదలు పెట్టారు. ఏళ్లుగా ఎలాంటి ఆలయం లేకుండా సాగింది. గుడి బండపై శివలింగం ఉండటంతో పూజలు, దూపదీపం లేకుండా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఆ శివయ్య ఉండిపోయాడు.

భక్తుల కోసం..



పూజలు లేకుండా ఆరుబయట ఉన్న శివయ్యకు ఆలయం కల్పించే భాగ్యం కలగడం అదృష్టం. చాలా సంవత్సరాల నుంచి శివలింగానికి పూజలు చేశాం. దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించాం. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాం. నిత్య పూజలు చేస్తూ భక్తులకు బ్రహ్మసూత్ర లింగ దర్శనం కల్పించేందుకు ఆలయ నిర్మాణం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నాం.

– రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్ సరిత దంపతులు

దక్షిణ కాశీగా..

గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, ఆయన భార్య కౌన్సిలర్ సరిత కలిసి రూ.లక్షలు వెచ్చించి ఆలయ నిర్మాణం చేపట్టారు. వారణాసి నగరంలో ఉండే విధంగా గర్భగుడికి నాలుగు ద్వారాలు ఏర్పాటు చేసి నిర్మించారు. దీంతో ఆలయం స్థానికంగా దక్షిణ కాశీగా పేరుగాంచింది. చెరువు ఒడ్డున ఆలయం నిర్మించి చుట్టూ ఉద్యానవనం అభివృద్ధి చేయడం, విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటు చేయడం, రోడ్లు, ఇతర వసతులు ఏర్పాటు చేయడం, మరోపక్క వెంకటేశ్వర ఆలయం ఉండటంతో అనతి కాలంలోనే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది.

మేడ్చల్ 14వ ఎమ్మెల్యే ఎవరో..?

- ప్రధానంగా పోటీ ఆ ఇద్దరి మధ్యే..
- ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్న మల్లారెడ్డి, వజ్రేష్‌యాదవ్
- మధ్యాహ్నం వరకు గెలుపుపై స్పష్టత



మల్లారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి

మేడ్చల్: పోటాపోటీగా జరిగిన ఎన్నికల ఫలితాలు ఆదివారం విడుదల కానున్నాయి. మేడ్చల్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అధికారులు కీసర మండల భోగారంలోని హోలిమేరి కళాశాలలో ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగియనుంది. ఫలితం 12 గంటలలోపే రానుంది.

ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ

మేడ్చల్ నుంచి ఎమ్మెల్యే కోసం 22మంది పోటీచేసినా ప్రధానంగా ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ మధ్య పోటీ కన్పించింది. విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. తమకు పడిన ఓట్లపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు. పోలైన ఓట్లలో 80 శాతం ఓట్లు తమవే అని బీఆర్ఎస్ ధీమాగా ఉండగా, చాపకింద నీరులా ఓట్లన్నీ తమకే వచ్చాయని బీజేపీ నాయకులు, విజయానికి కావాల్సిన ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయని, బీసీ ఓట్లు, మల్లారెడ్డి వ్యతిరేఖ ఓట్లు తమకే గంపగుత్తగా పడ్డాయని కాంగ్రెస్ నాయకులు ధీమాతో ఉన్నారు. మరికొద్ది గంటల్లో రానున్న ఫలితం తమకంటే తమకే అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- మేడ్చల్ 1952 ఏర్పడగా మొదటిసారి గోపాల్‌రెడ్డి(కాంగ్రెస్), 1962 రెండవసారి రాంచంద్రరావు (స్వతంత్ర), మూడవసారి 1972లో సుమిత్రాదేవి(స్వతంత్ర), 1978లో మర్రి చెన్నారెడ్డి(కాంగ్రెస్) 1983, 1989లో ఉమాదేవి(కాంగ్రెస్), 1985లో సురేందర్‌రెడ్డి(టీడీపీ), 1994, 1999, 2004లో దేవేందర్‌గౌడ్(టీడీపీ), 2009లో కేఎల్ఆర్(కాంగ్రెస్), 2014లో సుధీర్‌రెడ్డి(బీఆర్ఎస్), 2018లో మల్లారెడ్డి(బీఆర్ఎస్)లు మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తాజాగా ఎవరు 14వ ఎమ్మెల్యేగా మేడ్చల్‌కు పని చేయనున్నారో తేలనుంది.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

కుత్బుల్లాపూర్: ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం కావడంతో పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కింది. పారిశుద్ధ్య కిందిస్థాయి సిబ్బందిని సైతం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద నియమించడంతో ప్రధాన రోడ్ల వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎంఎస్ రెడ్డి నగర్ హనుమాన్ గుడి సమీపంలో చెత్త తొలగించకపోవడం మూలంగా అటువైపుగా వెళ్లే ప్రజలు ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చెత్తను తొలగించాలని శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానిక వాసి శ్యామ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇక్కడ చెత్త వేస్తే తొలగించేవారని, తాజాగా సిబ్బంది తొలగించకపోవడంతో ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంఎన్ రెడ్డినగర్ హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

ఇంత నిర్లక్ష్యమా?

• అధికారుల మధ్య సమన్వయ లోపం • రోడ్డు మధ్యలో పనిచేయని బోరు

రంగారెడ్డినగర్: ఏదైనా అభివృద్ధి పని చేపట్టే ముందు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పంపులు సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని తొలగించిన తరువాత చేపట్టాల్సి ఉంటుంది. కాని సర్కిల్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనడానికి రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లోని గ్రేవ్‌యార్డు వరకు ఇటీవల పూర్తి చేసిన రోడ్డు పనులనే ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇటీవల రూ.25 లక్షల నిధులతో జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్ నుండి హిందూ శ్మశాన వాటిక వరకు రోడ్డు పనులను చేపట్టారు. గత కొన్నేళ్లుగా రోడ్డు మధ్యలో చేతి పంపు వృథాగా పడి ఉంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే రోడ్డు పనులు చేపట్టే సమయంలో సర్కిల్ అధికారులు చేతి పంపును తొలగించాల్సిందిగా జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి లిఖిత పూర్వకంగా లేఖ రాయాల్సి ఉంటుంది. కాని ఇరు శాఖల మధ్య సమన్వయం కొరవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతి పంపు ఉండగానే రోడ్డు పనులు పూర్తి చేశాడు. దీంతో ప్రస్తుతం రోడ్డు మధ్యలో చేతి పంపు అడ్డుగా మారింది. దీంతో రాత్రి వేళల్లో చేతి పంపును గమనించక పలువురు వాహనదారులు ఢీకొంటున్నారు. పని చేయని చేతి పంపును ఎందుకు తొలగించడం లేదని, ఇటు జీహెచ్ఎంసీ, అటు జలమండలి అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది నిధులతో ఏర్పాటు చేసిన రోడ్డులో రాకపోకలకు చేతి పంపు ఆటంకంగా మారుతోందని, ఇప్పటికైనా ఇరు శాఖల అధికారులు ఇగోను విడనాడి రాకపోకలు సజావుగా కొనసాగేలా చేతి పంపును తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సంజయ్‌గాంధీనగర్‌లోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు మధ్యన ఉన్న చేతి పంపు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029